క్లుప్తంగా

నేడు వైభవుడికి సుప్రభాత సేవ



వైభవ వేంకటేశ్వరస్వామి

మురళీనగర్‌: కప్పరాడ ఎస్‌జీజీవోస్‌ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహిస్తారు. తెల్లవారుజామున సన్నిదిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపిస్తారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేస్తారు. ఉదయం 7.30 గంటలకు బాల భోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్టి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరుగుతాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేస్తారు. సాయంత్రం 6.30 గంటలకు వైభవుడికి విశేష హారతులు సమర్పిస్తారు.

'కర్మయోగి' పుస్తకావిష్కరణ

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీలోని ఐఐఏఎం వేదికగా శుక్రవారం కర్మయోగి పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఇండియన్‌ ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ పబ్లిక్‌ అడ్మినిస్ట్రేషన్‌ విశాఖపట్నం శాఖ, ఆల్వార్‌దాస్‌ గ్రూప్‌ ఆఫ్‌ ఎడ్యుకేషనల్‌ ఇన్‌స్టిట్యూట్స్‌ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఐఐపీఏ ఏపీ రీజనల్‌ బ్రాంచ్‌ చైర్మన్‌, మాజీ ఐఏఎస్‌ ఎం.గోపాలకృష్ణ లైఫ్‌ ఆఫ్‌ ఏ కర్మయోగి పుస్తకాన్ని రచించారు. కార్యక్రమంలో మాజీ ఐఏఎస్‌ ఈఏఎస్‌ శర్మ, మాజీ డీజీపీ నండూరి సాంబశివరావు, యూపీఎస్సీ మాజీ సభ్యుడు ఆచార్య కె.ఎస్‌.చలం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభకు తార్కాణమే 'స్పెక్ట్రమ్‌'



విద్యార్థుల ఆవిష్కరణను తిలకిస్తున్న వీసీ ఆచార్య రాజశేఖర్‌

విశాఖ విద్య: విద్యార్థుల అద్భుత ప్రతిభకు తార్కాణంగా 'స్పెక్ట్రమ్‌'ప్రదర్శన నిలిచిందని ఏయూ ఉపకులపతి ఆచార్య జి.పి రాజశేఖర్‌ అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం చిత్రకళా విభాగం బీఎఫ్‌ఎం, ఎంఎఫ్‌ఏ విద్యార్థుల వార్షిక చిత్రకళా ప్రదర్శన స్పెక్ట్రమ్‌– 2025ను శుక్రవారం వీసీ సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన శిల్పాలు, చిత్రాలు ఆయన తిలకించి అభినందించారు. విద్యార్థులు తమ అద్భుత ప్రతిభతో కళాఖండాలను తీర్చిదిద్దారని ప్రశంసించారు. శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా చిత్రకళా విభాగం విద్యార్థులను భాగస్వాములు చేస్తూ ఒక ప్రత్యేక ఆర్ట్‌ ఎగ్జిబిషన్‌ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులు తయారు చేసిన శిల్పాలు, చిత్రాలను నిశితంగా పరిశీలించి.. వాటి వెనుక ఉన్న భావాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విభాగాధిపతి డి.సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

రేపు సౌత్‌ ఇండియా ఓపెన్‌ కరాటే చాంపియన్‌షిప్‌



శిక్షణ పొందుతున్న విశాఖ క్రీడాకారులు

ఎంవీపీకాలనీ: సౌత్‌ ఇండియా ఓపెన్‌ కరాటే చాంపియన్‌షిప్‌ పోటీలు జూన్‌ 1న ఎంవీపీకాలనీలోని అప్పుఘర్‌ ఎదురుగా ఉన్న పోలమాంబ ఫంక్షన్‌ హాలులో జరగనున్నాయి. ఈ మేరకు బ్రూస్‌ లీ మార్షల్‌ ఆర్ట్స్‌ అసోసియేషన్‌ వ్యవస్థాపకుడు, చీఫ్‌ ఇన్‌స్ట్రక్టర్‌ చిన్నా ఓ ప్రకటనలో తెలిపారు. కొరియన్‌ చోటా ఖాన్‌ కరాటే అసోసియేషన్‌ ఆధ్వర్యంలో సౌత్‌ ఇండియా స్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ పోటీల కోసం జిల్లా బాల బాలికల జట్లను శుక్రవారం ఎంపిక చేశామన్నారు. 12 ఏళ్ల బాలికల విభాగంలో టి.తేజస్విని, 13 ఏళ్ల విభాగంలో జీవీ ఆరాధ్య, 16 ఏళ్ల విభాగంలో ఎస్‌.కావ్య, 17 ఏళ్ల విభాగంలో పి.సౌమ్య ఎంపికయ్యారు. 12 ఏళ్ల బాలుర విభాగంలో టి.తనుష్‌, 13 ఏళ్ల విభాగంలో సీహెచ్‌ మనోజ్‌ యాదవ్‌ ఈ పోటీలకు ఎంపికైనట్లు చిన్నా వెల్లడించారు. వీరికి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కోచ్‌లు గౌరీప్రియ, వైభవ్‌ గోపాల్‌ తదితరులు పాల్గొన్నారు.

నిరంతర నీటి సరఫరా ఎప్పుడు..?

- వేసవిలో అడుగంటిన భూగర్భ జలాలు
- 43, 44 వార్డుల్లోని ఇళ్లు, వీధుల్లో ఎండిపోయిన బోర్లు
- ఏడీబీ నిధులతో 24/7 తాగునీటి సరఫరాకు చర్యలు
- 2018లో పనులు ప్రారంభమైనా.. కొలిక్కిరాని వైనం
- వచ్చే వేసవికైనా పూర్తిచేయాలని కోరుతున్న స్థానికులు



అబిద్‌నగర్‌లో నిర్మించిన 800 కిలో లీటర్ల వోవర్‌హెడ్‌ ట్యాంక్‌

సీతంపేట: నగరంలో నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాలకు 24/7 నిరంతర తాగునీటి సరఫరాకు ఏషియా డెవలప్‌మెంట్‌ బ్యాంక్‌(ఏడీబీ) నిధులతో జీవీఎంసీ ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. జీవీఎంసీ పరిధిలోని నార్త్‌, వెస్ట్‌ సెక్టార్లలో నిరంతర తాగునీటి సరఫరాకు చర్యలు ప్రారంభించింది. దీని కోసం ఏడీబీ బ్యాంకు రూ.389 కోట్లు కేటాయించింది. దీనిలో భాగంగా ఉత్తర నియోజకవర్గంలోని 43, 44 వార్డుల్లో గల పలు ప్రాంతాల్లో 24/7 తాగునీటి సరఫరాకు 2018లో పనులు ప్రారంభించింది. రెండేళ్ల కాల వ్యవధిలో పనులు పూర్తి చేసి ప్రజలకు 24/7 తాగునీరు అందుబాటులోకి తేవాల్సి ఉంది. కరోనా వైరస్‌ కారణంగా రెండేళ్లు పనులు నిలిచిపోయాయి. మళ్లీ 2022లో పనులు చురుగ్గా ప్రారంభమయ్యాయి. మరో రెండేళ్లు ముగిసినా.. పనులు ఇంకా కొలిక్కి రాలేదు. ప్రజలు మాత్రం నిరంతర తాగునీటి కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు.

వేసవిలో నీటి ఎద్దడి సమస్య

జీవీఎంసీ 43, 44 వార్డుల్లో వేసవిలో నీటి ఎద్దడి నెలకొంటోంది. వేసవి వచ్చిందంటే చాలు భూగర్భ జలాలు అడుగంటి ఇళ్లు, వీధుల్లోని బోర్లు పనిచేయవు. పూర్తిగా జీవీఎంసీ సరఫరా చేసే కుళాయి నీటిపై ఆధార పడాల్సిన పరిస్థితి నెలకొంటోంది. 43వ వార్డులోని నందగిరినగర్‌, శ్రీనివాసనగర్‌, గోళీలపాలెం, సంగం ఆఫీస్‌, జగన్నాథపురం, వెంకటేశ్వర కాలనీ, నరేంద్రనగర్‌ ప్రాంతాలు వేసవిలో నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నాయి. 44వ వార్డులోని శ్రీనివాసనగర్‌, 80 ఫీట్‌ రోడ్డు ప్రాంతాల్లో నీటి సమస్య ఉంది. ఈ ప్రాంతాల ప్రజలు ఏళ్ల తరబడి తాగునీటి కోసం అవస్థలు పడుతున్నారు. వేసవి వచ్చిందంటే ఇక్కడి సుమారు 6 వేల కుటుంబాలు కుళాయి నీరు, జీవీఎంసీ ట్యాంకర్లపై ఆధారపడి కాలం వెళ్లదీస్తున్నాయి. 43, 44 వార్డుల్లో నీటి సమస్యను పరిష్కరించే దిశగా జీవీఎంసీ ఏడీబీ బ్యాంక్‌ నిధులతో 24/7 తాగునీటి సరఫరాకు ఉపక్రమించింది.



కుళాయి నీరు పట్టుకుంటున్న మహిళలు

పైప్‌లైన్‌ పనులు

ఈ వార్డుల్లో నీటి ఎద్దడి ఉన్న పలు ప్రాంతాలకు 24/7 తాగునీటి సరఫరాకు పైప్‌లైన్‌ పనులు కొంత కాలంగా జరుగుతున్నాయి. అక్కయ్యపాలెం 80 ఫీట్‌ రోడ్‌ నుంచి శ్రీనివాసనగర్‌ మీదుగా నందగిరినగర్‌ ప్రాంతానికి బల్క్‌ పైప్‌లైన్‌ వేశారు. ప్రస్తుతం దాడి రామ్మూర్తి కల్యాణ మండపం, కర్రివాని బ్రిడ్జి, యలమంచిలి వారి వీధి, గోళీలపాలెం, 80 ఫీట్‌ రోడ్‌, శ్రీనివాసనగర్‌, వెంకటేశ్వర కాలనీ, నందగిరినగర్‌ ప్రాంతాల్లోని అనుబంధ రహదారుల్లో పైప్‌లైన్‌ పనులు చేపడుతున్నారు. వోవర్‌హెడ్‌ ట్యాంక్‌ నుంచి నీటి సరఫరాకు ప్రధాన మార్గాల్లో పైప్‌లైన్‌ పనులు కొలిక్కొచ్చినా.. అనుబంధ రహదారుల్లో ఇవి పూర్తి కావాల్సి ఉంది. గృహాలకు నీటిని అందించడానికి పైప్‌ కనెక్షన్‌ పనులు జరగాల్సి ఉంది. ఇవన్నీ పూర్తి కావడానికి ఇంకా ఏడాది పైనే పడుతుందని తెలుస్తోంది. వచ్చే వేసవికైనా పనులు పూర్తిచేసి 24/7 తాగునీటి సరఫరా అందుబాటులోకి తేవాలని 43, 44 వార్డుల ప్రజలు కోరుతున్నారు.



నందగిరినగర్‌లో చేపడుతున్న పైప్‌లైన్‌ పనులు

800 కిలో లీటర్ల సామర్థ్యం

జీవీఎంసీ 43, 44 వార్డుల్లో ప్రజలకు నిరంతర తాగునీటి సౌకర్యం కల్పించేందుకు అబిద్‌నగర్‌ షాదీఖానా పక్కన 800 కిలో లీటర్ల సామర్థ్యం ఉన్న భారీ వోవర్‌హెడ్‌ ట్యాంక్‌ నిర్మించారు. దీని పనులు 2018లో ప్రారంభించినప్పటికీ కరోనా కారణంగా మధ్యలో రెండేళ్లు నిలిచిపోయాయి. 2022 నుంచి గత ప్రభుత్వ హయాంలో పనులు చురుగ్గా సాగి.. ట్యాంక్‌ నిర్మాణం పూర్తయింది. దీని నుంచి 43, 44 వార్డుల్లోని పలు ప్రాంతాలకు నీటిని సరఫరా చేయడానికి అమృత్‌ 2.0 పథకం కింద పైప్‌ లైన్లు వేసే పనులు కొద్ది రోజులుగా జరుగుతున్నాయి.



శ్రీనివాసనగర్‌లో జరుగుతున్న 24/7 నీటి సరఫరా పనులు

వేసవికి ముందే నీటి ఎద్దడి



వేసవి ప్రారంభానికి ముందే నీళ్లు అడుగంటుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో జనవరిలో, మరికొన్ని చోట్ల మార్చిలో భూమిలో నీరు అడుగంటి పోతోంది. ఇళ్లల్లో బోర్లు ఎండిపోతున్నాయి. వీధుల్లో బోర్లు చుక్క నీరివ్వడం లేదు. జీవీఎంసీ సరఫరా చేసే కుళాయి నీటిపై ఆధారపడ్డాం. అది సరిపోక వేసవిలో అవస్థల పాలవుతున్నాం. గతంలో జీవీఎంసీ ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసేది. ఈ ఏడాది అవి రాలేదు. 24/7 పనులు తాగునీటి సరఫరా త్వరగా పూర్తి చేస్తే బాగుంటుంది. – ఎస్‌.జయ, నందగిరినగర్‌

పనులు త్వరగా పూర్తిచేయాలి



43, 44 వార్డుల ప్రజలకు నిరంతరం తాగునీరు అందిస్తామని ఏడేళ్ల కిందట పనులు ప్రారంభమయ్యాయి. ఇంకా ఒక కొలిక్కి రాలేదు. షాదీఖానా వద్ద పెద్ద వోవర్‌ హెడ్‌ ట్యాంక్‌ నిర్మించారు. నీటి సరఫరాకు పైప్‌లైన్‌ పనులు కొంత కాలంగా జరుగుతున్నాయి. ఇవి పూర్తి కావడానికి మరో ఏడాది పట్టేట్టుంది. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి పనులు త్వరితగతిన పూర్తి చేసి వచ్చే వేసవి నాటికి 24/7 నిరంతర తాగునీటి సరఫరా అందుబాటులోకి తెస్తే మాకు మేలు చేసిన వారవుతారు. – రాజగిరి సింహాచలం, అక్కయ్యపాలెం

యోగా దినోత్సవానికి పటిష్ట ఏర్పాట్లు



మాట్లాడుతున్న కలెక్టర్‌ హరేందిర ప్రసాద్‌

మహారాణిపేట: జూన్‌ 21న జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవానికి పటిష్ట ఏర్పాట్లు చేయాలని కలెక్టర్‌ ఎం.ఎన్‌. హరేందిర ప్రసాద్‌ అధికారులను ఆదేశించారు. ప్రజలకు ట్రాఫిక్‌, పార్కింగ్‌ ఇబ్బందులు లేకుండా చూస్తూ, వేదికల వద్ద అన్ని మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో ఆయన సమావేశమయ్యారు. కాళీమాత టెంపుల్‌ నుంచి భీమిలి వరకు ప్రధాన రహదారిపై యోగా వేదికలతో పాటు, మరో 25 అదనపు వేదికలను ఏర్పాటు చేయనున్నారు. ఈ వేదికల వద్ద తాగునీరు, టాయిలెట్లు, విద్యుత్‌, హెల్ప్‌ కౌంటర్లు వంటి సదుపాయాలు కల్పించాలని కలెక్టర్‌ స్పష్టం చేశారు. ఏ ప్రాంతం వారు ఏ వేదికకు చేరుకోవాలి, వాహనాలు ఎక్కడ నిలపాలి వంటి వివరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రధాన వేదిక మార్గంలో సుందరీకరణ, మరమ్మత్తులు, విద్యుదీకరణ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్‌ ఆదేశించారు. రోడ్ల మధ్యలో చెట్ల కొమ్మలు తొలగించి, డివైడర్లకు, గోడలకు రంగులు వేయాలన్నారు. మత్స్యదర్శినికి రంగులు వేసి, పాడుపడిన భవంతిని కవర్‌ చేయాలని సూచించారు. డ్రెయిన్లను శుభ్రపరిచి, అవసరమైన చోట్ల మరమ్మతులు చేపట్టాలని ఇంజనీరింగ్‌ అధికారులకు తెలిపారు. పార్కింగ్‌ ప్రాంతాల్లో విద్యుదీకరణ, తాగునీరు, టాయిలెట్లు ఏర్పాటు చేయాలని, హోర్డింగులు, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమావేశంలో డీసీపీలు అజిత, మేరీ ప్రశాంతి, జాయింట్‌ కలెక్టర్‌ కె. మయూర్‌ అశోక్‌, డీఆర్వో బీహెచ్‌ భవానీ శంకర్‌, ఆర్డీవోలు పి. శ్రీలేఖ, సంగీత్‌ మాధుర్‌, జీవీఎంసీ ఇంజనీరింగ్‌ అధికారులు పాల్గొన్నారు.

చిన్న ఆలయాలే టార్గెట్‌

గుడుల్లో చోరీలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్‌



వివరాలు వెల్లడిస్తున్న క్రైం ఏడీసీపీ మోహన్‌రావు

అల్లిపురం: ఆలయాల్లో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ఆకోజు బ్రహ్మాజీ అనే వ్యక్తిని వన్‌టౌన్‌ క్రైం పోలీసులు అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుడి నుంచి సుమారు 2,900 గ్రాముల వెండి, 7.6 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. వన్‌టౌన్‌ పోలీస్‌ స్టేషన్‌ ఆవరణలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో క్రైం ఏడీసీపీ మోహన్‌రావు వివరాలు వెల్లడించారు. అల్లిపురం, సింహాలదేవిడికి చెందిన చెందిన బ్రహ్మాజీ ఈ నెల 19న టౌన్‌ కొత్తరోడ్డులోని దుర్గమ్మ గుడిలో పూజారిగా పని చేస్తానని వెళ్లాడు. నిర్వాహకులు సకల సూర్యారావు దంపతులు అతన్ని నమ్మి పూజ బాధ్యతలు అప్పగించారు. పూజకు కావాల్సిన వస్తువులు తెచ్చేందుకు ఇంట్లోకి వెళ్లిన వారు తిరిగి వచ్చే సరికి అమ్మవారికి అలంకరించిన వెండి కిరీటం, హస్తం, చెవి ఆభరణాలతో ఉడాయించాడు. దీనిపై ఫిర్యాదు అందుకున్న వన్‌టౌన్‌ క్రైం పోలీసులు.. హార్బర్‌ క్రైం ఇన్‌స్పెక్టర్‌ ఎ.శ్రీనివాసు పర్యవేక్షణలో విచారణ చేపట్టారు. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా నిందితుడిని గుర్తించి.. శుక్రవారం కురుపాం మార్కెట్‌ జంక్షన్‌ వద్ద అరెస్ట్‌ చేశారు. అతని వద్ద నుంచి మొత్తం 10 నేరాలకు సంబంధించిన సుమారు 2,900 గ్రాముల వెండి వస్తువులు, 7.6 గ్రాముల బంగారు వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. విచారణలో బ్రహ్మాజీ ఒంటరిగా జీవిస్తున్నాడని, ఆర్థిక ఇబ్బందుల కారణంగానే దొంగతనాలకు పాల్పడుతున్నాడని తేలింది. భార్య, కుమారుడు అతన్ని వదిలేశారు. వయసు కారణంగా వేరే పనులు చేసుకోలేని బ్రహ్మాజీ చిన్న ఆలయాల్లో ఆభరణాలు దొంగలించి, రోజువారీ అవసరాలు తీర్చుకుంటున్నాడు. అతను గతంలోనూ వన్‌టౌన్‌, పెందుర్తి, కంచరపాలెం, మల్కాపురం, చోడవరం, భీమిలీ పోలీస్‌ స్టేషన్ల పరిధిలో ఇలాంటి నేరాలకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. సమావేశంలో హార్బర్‌ సబ్‌ డివిజన్‌ క్రైం సీఐ జి.శ్రీనివాసరావు, వన్‌టౌన్‌ క్రైం ఎస్‌ఐ ఎస్‌.రామమూర్తి, ఎస్‌ఐ ఎంవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా గొయ్యి



స్వర్ణభారతి స్టేడియం వద్ద రోడ్డు మధ్యలో డివైడర్‌పై తవ్వి వదిలేసిన గొయ్యి

సీతంపేట: స్వర్ణభారతి స్టేడియం సమీపంలో స్పెన్సర్స్‌ మాల్‌ ఎదురుగా రహదారి మధ్యలో డివైడర్‌పై తవ్వివదిలేసిన గొయ్యి ప్రమాదకరంగా మారింది. సుమారు నాలుగడుగుల లోతు, రెండడుగుల వెడల్పుతో ఉన్న గొయ్యి బస్‌ షెల్టర్‌ పక్కనే ఉండటంతో ఎవరైనా ఆదమరిచి అడుగేస్తే గోతిలో పడి గాయాల పాలవడం ఖాయమని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి సమయంలో ఎవరైనా డివైడర్‌పై నడిస్తే ప్రమాదం బారినపడే అవకాశముంది. అక్కడ గొయ్యి ఎందుకు తవ్వారో, ఎందుకు వదిలేశారో తెలియడం లేదని, సుమారు ఏడాదిన్నర కాలంగా ప్రమాదకరంగా ఉందని స్థానికులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి గొయ్యి పూడ్చడానికి తగు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ముంచెత్తిన వాన.. రోడ్లు జలమయం



లలితానగర్‌లో కురుస్తున్న వర్షం



అక్కయ్యపాలెంలో జోరుగా కురుస్తున్న వానలో ప్రయాణిస్తున్న మహిళ



అక్కయ్యపాలెం రోడ్డుపై నుంచి ఏరులై ప్రవహిస్తున్న వర్షపు నీరు

సీతంపేట: మండుతున్న ఎండలతో సతమతమవుతున్న జనానికి చల్లటి వాన ఊరటనిచ్చింది. కొద్ది రోజులుగా భానుడి ప్రభావంతో అల్లాడిపోతున్న జనం చల్లని వాతావరణంలో సేదతీరారు. శుక్రవారం సాయంత్రం ఆకస్మాత్తుగా భారీ వర్షం కురవడంతో పాదచారులు, వాహన చోదకులు తడవకుండా ఉండేందుకు పరుగులు తీశారు. ఉద్యోగులు, వ్యాపారులు, అత్యవసర పనులపై బయటకు వచ్చిన వారు గొడుగులు, రెయిన్‌కోట్లు ధరించి పనులు చక్కబెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. వర్షం కారణంగా వ్యాపారం సాగక చిరు, తోపుడు బళ్ల వ్యాపారులు ఉసూరుమన్నారు. సీతంపేట, అక్కయ్యపాలెం, లలితానగర్‌, జగన్నాథపురం, శ్రీనివాసనగర్‌, అబిద్‌నగర్‌, నరసింహనగర్‌ ప్రాంతాల్లోని రహదారులపై వర్షపు నీరు ఏరులై ప్రవహించింది. గంట సేపు ఏకధాటిగా కురిసిన వర్షానికి రోడ్లు జలమయమయ్యాయి. డ్రెయిన్లు, గెడ్డల్లో వర్షపు నీరు పొంగి పొర్లింది.

బాలల హక్కుల ప్రచార రథం ప్రారంభం



ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న పీడీ చిన్మయాదేవి

ఆరిలోవ: బాలలు వారి హక్కులపై అవగాహన కల్పించుకోవడానికి ప్రత్యేకంగా ప్రచార రథం అందుబాటులోకి వచ్చింది. దీన్ని శుక్రవారం మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్‌ డైరెక్టర్‌ చిన్మయాదేవి పైనాపిల్‌ కాలనీ జిల్లా మహిళా ప్రాంగణం ఆవరణలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలలు వారి హక్కులపై ఈ రథం నగరంతో పాటు గ్రామాల్లో తిరుగుతుందని తెలిపారు. బాలలు వారికున్న హక్కులను తెలుసుకోవాలన్నారు. బాల్య వివాహాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందని చెప్పారు. బాల్య వివాహాల వల్ల సంభవించే దుష్పరిణామాల గురించి ప్రచార రథం ద్వారా అవగాహన కల్పిస్తారన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్‌ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన రైల్వే వేసవి క్రీడా శిబిరాలు



ట్రోఫీ అందుకుంటున్న శిక్షణార్థులు

విశాఖ స్పోర్ట్స్‌: తూర్పు కోస్తా రైల్వే వాల్తేర్‌ ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు శుక్రవారంతో ముగిశాయి. 40 రోజుల పాటు ఐదేళ్ల నుంచి 16 ఏళ్ల బాల బాలికలు ఈ శిబిరాల్లో శిక్షణ పొందారు. బాల బాలికలకు అథ్లెటిక్స్‌, బాక్సింగ్‌, బాస్కెట్‌బాల్‌, బ్యాడ్మింటన్‌, స్విమ్మింగ్‌, టెన్నిస్‌, టీటీ, యోగాల్లో శిక్షణ ఇవ్వగా.. బాలురకు క్రికెట్‌, బాల్‌ బ్యాడ్మింటన్‌, వాలీబాల్‌లో శిక్షణ నిర్వహించారు. శిబిరం చివరి రోజున పలు క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించి విజేతలకు ట్రోఫీలతోపాటు సర్టిఫికెట్లను అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డీఆర్‌ఎం లలిత్‌ బోరా మాట్లాడుతూ యువ ప్రతిభను ప్రోత్సహించేందుకు, స్థానిక యువత క్రీడల్లో రాణించేందుకు ఈ శిబిరాలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో జ్యోత్స్నా బోరా, ఏడీఆర్‌ఎం మనోజ్‌కుమార్‌, క్రీడాధికారి ఎం.హరనాథ్‌, జుసుఫ్‌, పాటిల్‌, సాహూ, ఉష తదితరులు పాల్గొన్నారు.

నిర్ణీత గడువులోగా సమస్యలు పరిష్కరించాలి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న చీఫ్‌ సిటీ ప్లానర్‌ ప్రభాకరరావు

దాబాగార్డెన్స్‌: ప్రజల వినతులు, అర్జీలను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని జీవీఎంసీ చీఫ్‌ సిటీ ప్లానర్‌ ప్రభాకరరావు పట్టణ ప్రణాళిక విభాగం అధికారులను ఆదేశించారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం టౌన్‌ ప్లానింగ్‌ ఓపెన్‌ ఫోరం నిర్వహించారు. కార్యక్రమంలో చీఫ్‌ సిటీ ప్లానర్‌ పాల్గొని ఫిర్యాదులు స్వీకరించారు. అందిన 16 వినతుల్లో జోన్‌–1 నుంచి ఒకటి, జోన్‌–2 నుంచి ఒకటి, జోన్‌–3 నుంచి ఒకటి, జోన్‌–4 నుంచి రెండు, జోన్‌–5 నుంచి తొమ్మిది, జోన్‌–7 నుంచి రెండు వినతులు వచ్చాయి. జీవీఎంసీ పరిధిలో ప్రజలు పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి ఫిర్యాదులు, అర్జీలు ప్రతి శుక్రవారం నమోదు చేసుకోవచ్చని చీఫ్‌ సిటీ ప్లానర్‌ తెలిపారు. కార్యక్రమంలో సీపీలు, డీసీపీలు, ఏసీపీలు పాల్గొన్నారు.

రేపు తొట్లకొండపై యోగాంధ్ర

మహారాణిపేట: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఆదివారం తొట్లకొండలో 'యోగాంధ్ర' కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంలో ఉదయం 6.30 నుంచి 8 గంటల మధ్య యోగాసనాలు వేయనున్నారు. ఈ కార్యక్రమంలో ఇండియన్‌ నేవీ, స్వయం సహాయక బృందాల సభ్యులు, వివిధ యోగా సంఘాల సభ్యులు, జిల్లా అధికారులు సహా సుమారు వెయ్యి మంది పాల్గొంటారు. జిల్లా పర్యాటక శాఖాధికారి నేతృత్వంలో యోగాంధ్ర వేడుకలు నిర్వహించాలని, మిగిలిన శాఖల అధికారులు సహాయ సహకారాలు అందించాలని, సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్‌ ఎం.ఎన్‌. హరేందిర ప్రసాద్‌ శుక్రవారం సాయంత్రం ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేశారు.